# అమ్మ చచ్చిపోయింది

– శ్రీలత

'ఆఫీసుకు లీవు పెట్టి మూడు రోజులు'

'నేను మాత్రం వారం రోజులయింది ఇల్లు వదిలి వచ్చి, పిల్లలూ మీ బావగారూ ఏం చేస్తున్నారో దిగులుగా వుంది'

'వదిన కూడా ఒకటే సణుగుతూందే అక్కయ్యా'

'సణగదు మరీ, మా అత్తగారు కూడా ఇలాగే వేధించిందే నన్ను. ఇంచుమించూ మూడు నెలలు మంచం పట్టిందనుకో, ఏ పూటకాపూట ఈ రోజైనా చచ్చిపోతుందా అని ఎదురు చూశామనుకో. ఇంట్లో చచ్చి, చచ్చిపోని అర్ధ శవాన్ని పెట్టుకుని ఎన్నాళ్లు వేగుతాం. భోజనం సయించదు. మనసుకు కుదుట ఉండదూ, చెప్పొద్దులే చిట్టీ ఆ కష్టాలు'

'అంటే అమ్మ కూడా మూణ్ణెళ్లు బ్రతికే ఉంటుందంటావా?'

'మూణ్ణెళ్ల సంగతేమోగాని ఇప్పట్లో మాత్రం పోదనిపిస్తోంది'

'అన్నయ్యకు ఒకటే కంగారు. హడావిడి ఫోన్లు చేసి వచ్చేవరకూ ఊరుకోడు. కాస్త స్పృహ తప్పగానే 'అయిపోయేలా ఉంది రండహో' అని పిలవడం, మనం పరిగెత్తుకు రావడం. ఇది మూడోసారో, నాలుగోసారో కదూ. అమ్మ మీద వాడికి మరీ ప్రేమెక్కువా' దీర్ఘం తీసింది చెల్లెలు.

'ప్రేమా, గాడిద గుడ్డా. వాళ్లావిడెక్కడ చెయ్యాల్సి వస్తుందోనని, కాస్త మంచంలో పడగానే అయిపోతుంది... అయిపోతుంది... అని ఫోన్లు. మనం ఆవిడదంతా ఎత్తిపోసి కాస్త లేచి తిరగడం మొదలెట్టాక, 'అయ్యో అక్కయ్యా బావగారికి ఇబ్బంది కాదూ? ఏవిటే చెల్లాయ్ నీకు లీవులు వేస్టవడం లేదూ?' అని తరమడం. ఇదేదో అమ్మ మీద ప్రేమా, అక్కచెల్లెళ్ల మీద అనురాగం అనుకుంటున్నట్లున్నావు నువ్వు.'

'ససేమిరా కాదు, ఉమ్మడి సంసారానికి మూడో కోడల్ని. నాకెంత అనుభవం వుండాలి మరి ఇలాంటి విషయాల్లో.'

'అమ్మ కదుల్తోందే అక్కయ్యా'

'కదల్నీ... ఈ రోజు కదిలిందంటే రేపు లేచి తిరిగి తీరుతుంది.'

ఈ మాదిరి సంభాషణ నాలుగు రోజులుగా సాగుతోంది. చావుకు దగ్గరై ప్రాణం పోక విలవిలలాడుతున్న కామాక్షికి వినికిడి ఏమాత్రం చెక్కుచెదరలేదు గనుక చాలా స్పష్టంగా వినబడుతున్నాయి. మాట్లాడుకునే వాళ్లకు తనకు వినబడడం లేదని మాట్లాడుకుంటున్నారో, విన్నాకయినా గుండె పగిలి ఛస్తుందేమోనని ఆశపడుతున్నారో కామాక్షికి తెలియడం లేదు కానీ, అటు వినపడుతూ, ఇటు గుండె పగలక తలుపు చెక్కలో పడేసి కసిగా నొక్కుతున్నట్లు ప్రాణం గిజగిజలాడుతోంది. బల్లి విడిచిన తోకలా శరీరం ఉన్నచోటే కంపించిపోతోంది.

ఆ కంపనలోంచి తన అమ్మ గురించిన ఓ జ్ఞాపకం నిలువెల్లా పాకి నిలదీసింది.

కామాక్షి తల్లికి ఐదుగురు కూతుళ్లు. కామాక్షి మూడవ సంతానం. ఐదుగురూ ఆడపిల్లల్నే కందని భార్య మీద కోపం వల్ల, భార్యంటే చిరాకుగా ఉండేవాడు కామాక్షి తండ్రి పరంధామం. ఇంట్లో ఎప్పుడూ చిర్రుబుర్రులాడుతూ ప్రతి సమస్యకూ భార్యనే తప్పుపడుతూ ఉండేవాడు. తన అసంతృప్తినీ, కుటుంబాన్ని పోషించలేనన్నే అసహాయతని ఎప్పుడూ భార్య మీద, పిల్లల మీద చూపిస్తూ ఉండేవాడు. కొన్నిటికి బదులు చెప్పినా చాలావాటికి నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయేది. బదులు చెప్పినపుడు తాడెత్తున రెచ్చిపోయేవాడు పరంధామం. పిల్లలందరూ తల్లిని వదిలేసి తండ్రిని సమర్థించేవారు.

'నాన్నేదో కోపంలో అంటే నువ్వూ అంటావా' అని ఎదురు తిట్టేవాళ్లు. రానురాను తను నోరు

విప్పినా తిట్లే, విప్పకపోయినా తిట్లే అని తెలిశాక మౌనమయిపోయింది ఆమె. అది ఒక అలవాటుగా మారిపోయి ప్రతీదానికి తిట్లు తిట్టడానికి ఓ కారణం లేని బ్రతుకయిపోయింది ఆమెది.

ఇలాగే ఏదో మాట పట్టింపు వచ్చి, కారణం లేకుండానే భార్యను తిట్టి, 'నీది దరిద్రపు జాతకం. అందువల్లే నాకు వంశాంకురం లేదు, నయాపైసా ఆదాయం లేదు. కనీసపు సుఖశాంతులూ లేవు. సంసారమంటే విరక్తి పుట్టింది. అందుకే ఇల్లు వదిలేసి వెళ్తున్నా. ఇందుకు కూడా నీ జాతకమే కారణం. నీ జాతకంలో భర్తతో కాపురం చేసే యోగం లేదు' అని ఉత్తరం రాసిపెట్టి అతి సులువుగా జీవితపు బాధ్యతల నుంచి తప్పించుకుని వెళ్లిపోయాడు. అప్పుడు కూడా నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయింది ఆ ఇల్లాలు.

అన్నదమ్ముల్నీ మేనమామల్నీ చనువు చేసుకుని బ్రతిమాలో, భంగపడో ఇద్దరు కూతుళ్లకూ గంతకు తగ్గ బొంతల్ని చేసి అత్తారింటికి పంపింది. కామాక్షికో కుట్టుమిషన్ కొనిచ్చింది. చిన్న పిల్లలిద్దర్నీ చదివిస్తోంది.

ఆ ఇంట్లో ఈ ఇంట్లో పండగలకూ, పబ్బాలకూ, పెళ్లిళ్లకూ వంటలు చేసి అంతో ఇంతో కూడబెట్టుకుంది. కామాక్షిని కూడా అత్తారింటికి పంపేందుకు. నాలుగో కూతుర్ని మేనమామ మనవడికీ, ఐదో కూతుర్ని పినతల్లి కొడుక్కు చేసుకునేందుకు మాట తెచ్చుకుంది మంచితనంతో...

'మీ ఆయన సన్యాసుల్లో కలిసిపోయాట్టగా' అని ఎవరయినా అడిగితే నవ్వేది, 'ఒట్టి ఎస్కేపిస్ట్' అని మాత్రం అనేది కాదు.

పెళ్లయినప్పటి నుంచీ అన్నింటికీ తనే కారణం అని వేలెత్తి చూపడం ఇంట్లో భర్త నుంచీ పిల్లల నుంచీ పాకి చుట్టాల్లోకీ, పరిచయస్థుల్లోకీ, సమాజంలోకీ అల్లుకుపోయింది.

'ఆ... ఆడపిల్లలు పుట్టారనీ, లేదా ఆర్థిక బాధలున్నాయనీ ఇల్లొదిలి వెళ్తారా ఎవరయినా. ఈవిడలోనే ఏదో లోపముంది. అందుకే ఆయన జెండా ఎత్తేశాడు' అని గొణుక్కోవడం విన్నా కూడా...

'నా లోపం తప్పకుండా ఉంది. అదేవిటంటే ఒరేయ్ చవటా... ఆడపిల్లలు పుట్టడానికి కారణం నేను కాదు నువ్వు. మమ్మల్ని పోషించే సమర్థత లేకపోతే మానెయి. నేనే ఏదో కాళ్లావేళ్లాపడి నా పిల్లల్ని బ్రతికించుకుని బాధ్యతలు తీర్చుకుంటాను- అని మొహామ్మీద చెప్పలేకపోయిన లోపం ఉంది' అని మనసులో అనుకున్నా, మాటగా మాత్రం మార్చేది కాదు.

'చవటయినా మొగాణ్ణి సమర్థుణ్ణి చేసి, సమర్థత ఉన్న స్త్రీని దద్దమ్మను చేసే మిమ్మల్ని

## శకలాలు

కళ్లకన్నా కనురెప్పలు గొప్పవి
శ్రమ సౌందర్యాన్ని కంటికి అవే కదా
నేర్పుతాయి

* * *

అదింకా కొనసాగుతూ ఉండటమే
ఆశ్చర్యకరమైన విషయం
దాని పేరు జీవితం!

* * *

వాళ్లింక ఎలా మారుతారు?
కొవ్వొత్తిని వీపు వెనుక పట్టుకుని
ముందంతా నీడ పరుచుకున్నందుకు
విసుక్కునే వాళ్లు!

* * *

తుఫాన్లూ-ప్రళయాలూ వచ్చినప్పుడు
వాటి భాషను మా నోటితో మాట్లాడే మ్రానుల
ముందు
నీవేంటి నిబ్బరంగా ఏమీ పట్టనట్టున్నావు?
మెత్తగా నవ్వింది గడ్డిపోచ!

* * *

ఒక ముక్కు నుండి ఇంకో ముక్కుకి
ప్రయాణించే లోపునే కొంత విశ్రాంతి
శ్వాసకి!

*- వేణూ సంకోజు*

పట్టించుకునేదేవిటి' అన్నట్లుగా ఉండేది అడిగిన వాళ్లకు ఆమె నవ్వు.

సమాధానం రాక భుజాలు తడుముకుని ఊరుకునేవాళ్లు సామాజికులు. సమాజానికి ఆమె ఎప్పుడూ సమాధానం చెప్పలేదు. చిన్నబుచ్చుకోలేదు కూడా. ఆ రెండు అవసరాలూ నాకు లేవు అన్నట్లుగా వుంది.

కథ ఈ విధంగానైనా సుఖాంతం అవుతుందనుకుంటే కంకాళుడిలా ఊడిపడ్డాడు పరంధామం. ఆ పడేవాడు తనింట్లో పడితే బావుండేది. 'పిడుగు పడితే ఏం చేసేదాన్ని, పిడుగు బదులు మొగుడు పడ్డాడని ఓర్చుకోవడం తప్ప' అని ఊరకుండిపోయేదా ఇల్లాలు.

ఉరిమీ ఉరిమీ మంగళం మీద పడ్డట్లు వెళ్లి బావమరుదులింట్లో పడ్డాడు. పడేవాడు పడి ఊరుకోక...

'మీ అక్క మీద కోపంతో వెళ్లిపోయినా, పిల్లలు రోజూ కల్లోకి వచ్చేవారనీ, సన్యాసిగా మారినా వీరందరూ గుర్తొచ్చినపుడు భవబంధాలు బాధించేవనీ, ఆ బాధ తట్టుకోలేక మిమ్మల్ని ఓసారి చూసి పోదామని వచ్చానని, తీరా వచ్చాక మీవంటి సహృదయులను వదలి వెళ్లబుద్ధవడం లేద'ని బావురుమన్నాడు.

అక్కకు అన్యాయం జరిగిందని తిడదామని కసి వున్నా, 'ఏదో తిరిగొచ్చాడుగా సంతోషించండి. మీ అక్కకు కూడా పంతం మాని కాస్త కుదురుకూర్చుకుని భర్తను ఆదరించమని చెప్పండి' అని తిరోగమనంలో సామాజికులు ఉపన్యాసం ఇచ్చి వెళ్లడంతో పరిష్కారం ఆలోచించడానికి ఎక్స్ సన్యాసి బావగార్ని అడిగారు ఏం చేద్దామని.

'నేను ఉంటాను కానీ మీ అక్క మొహం మాత్రం చూడను' అని రాజీకొచ్చాడు. చితక్కొడదామనిపించినా మళ్లీ సామాజికులు గుర్తొచ్చి ఆగిపోయారు బావమరుదులు, 'మీ అక్క పసుపు కుంకుమల గురించైనా ఆలోచించలేదా' అంటారని.

అక్క దగ్గరికెళ్లి, 'అక్కయ్యా... ఆయన వల్ల ఉపయోగం లేకపోయినా మనం భరించాల్సిందే. మాకు తప్పదు, సర్దుకు పోవాల్సిందే, నీకూ తప్పదు' అన్నారు. అప్పుడూ నవ్వింది ముందు మాదిరిగానే.

సన్యాసిగా ఉన్నపుడు అలవాటయిపోయిందేమో రోజంతా బలాదూర్ తిరిగి ఆకలేసినపుడు ఇంటికి వచ్చేవాడు. నాలుగు చెంబులు నీళ్లు పోసుకుని ఆబగా అన్నం తిని మళ్లీ రోడ్డుమీద పడేవాడు.

ఉన్న అద్దె ఇల్లు. వంటకు చిన్న పార్టిషన్ పెట్టుకోగా, ఓ మాదిరి గది ఉండేది. అందులోనే సమస్తం. తండ్రి రాగానే పిల్లలు...

'నాన్నొస్తున్నాడు నాన్నొస్తున్నాడు' అనేవారు బందిపోటును చూసిన గ్రామస్థుల్లా... చటుక్కున వంటింటి మూలకు సర్దుకునేది ఆదరాబాదరాగా స్నానం చేశాక.

'నువ్వు బాత్‌రూంలోకెళ్లు, నాన్న అన్నానికి వస్తున్నాడు' అనేవారు. తల్లి బాత్‌రూంలోకి వెళ్లాక

## జీవితార్థం

సినిమాలు, షికార్లు
క్యాంటిన్‌లో కబుర్లు
ఒకటేమిటి...!?
ఆనందాకాశపు అంచులు తాకిన
కాలేజీ రోజులన్నీ గతించి

గడ్డాలు పెరిగి
కాళ్లకింద చెప్పులు అరిగి
రోడ్ల వెంట నడుస్తూ
కన్నీళ్లు తుడుస్తూ
పట్టాలు పట్టుకు తిరిగినప్పుడు

కడుపు మాడి
మొఖం సొట్టలు పడి
ఆకలికి అలమటిస్తూ
అన్నమో రామచంద్రా అని పలవరిస్తూ
బ్రతుకు దారి అన్వేషిస్తున్నప్పుడు...
తెలిసింది–
జీవితమంటే ఇట్టా ఉంటుందని.

– యస్. జయన్న

దానికి గడియపెట్టి తండ్రికి అన్నం వడ్డించేవాళ్లు. తినేసి వెళ్లాక 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని బాత్‌రూం తలుపు తీసేవారు. కానీ 'అమ్మ మొహం చూడ్డం ఇష్టంలేని వాడివి ఆవిడ చేతి వంటెందుకు మింగడం?' అనేవారు కాదు.

బాత్‌రూమ్ కమ్ లావెట్రీ వున్న ఆ చిన్న ఇరుకు రూమ్‌లో గాలిరాక ఉక్కిరిబిక్కిరై నిలుచునీ నిలుచునీ కాళ్లు నెప్పెట్టి బయటికి రాగానే కూలబడేది కాసేపు. తల్లి అవస్థ చూసి కూడా పిల్లలు జాలిపడేవారు కాదు. తల్లే ఏమీ చెయ్యలేనపుడు మేమెంత అనుకునేవారేమో.

ఆ రోజు రాత్రి పదకొండుదాకా భోజనానికి రాలేదు ఎక్స్ సన్యాసిగారు. సన్యాసం పుచ్చుకున్న తండ్రి తిరిగొచ్చాడని చూడ్డానికి పెద్ద పిల్లలు, వాళ్ల పిల్లలూ, అల్లుళ్లిద్దరూ కూడా వచ్చారు. ఈయనగారి దర్శనభాగ్యం కోసం ఎదురుచూస్తున్నారు తిట్టుకుంటూనే.

పదకొండున్నరకు తుఫాను బాధితుల్ని పరామర్శించడానికి వచ్చిన చీఫ్ మినిస్టర్‌లా పిల్లల్ని జాలిచూపులు చూస్తూ లోపలికి వచ్చాడు.

'నాన్నొస్తున్నాడు, నాన్నొస్తున్నాడు' అని చిన్నపిల్లలిద్దరూ అనడంతో బాత్‌రూంలోకి వెళ్లిపోయిందా ఇల్లాలు. బయట గొళ్లెం పెట్టేశారు. పిల్లలందరూ ఒక్కచోట ఉన్నారు కదా, ఆ ఇంట్లో ఈ ఇంట్లో కాస్త బదుళ్లడిగి, పిండివంటలు చేసి నడుం పీకుతుంటే నిలుచోవడం చేతకాక ముక్కుకు కొంగు అడ్డం పెట్టుకుని మూలగా కూలబడింది.

భోజనాలు, కబుర్లు అన్నీ అయేసరికి రాత్రి రెండయింది. ఎక్కడి వాళ్లక్కడ సర్దుకున్నాక అమ్మ గుర్తొచ్చి ఆదరాబాదరాగా బాత్‌రూమ్ తలుపు తీసేసరికి మూలకు చేరగిలబడి వున్న అమ్మను పిలిస్తే పలకకపోతే, నిద్రపోతోందేమోనని తట్టి లేపబోయి, చల్లబడిపోయిన అమ్మను చూసి...

'రండర్రా అమ్మ చచ్చిపోయింది' అని అరిచింది పెద్దకూతురు.

బాత్‌రూమ్‌లోంచి నీళ్లు పోయే దార్లోంచి అప్పుడప్పుడు కాళ్లజెర్రులు రావడం జరుగుతుండేది కనుక, ఏదో పురుగొచ్చి కుట్టిందనుకున్నారు. ఎలాగూ చనిపోయింది కనుక డాక్టరును పిలిస్తే పోస్టుమార్టమ్ గట్రా చెయ్యడానికి అనవసరపు ఖర్చు భరించలేని స్థితి కనుక ఊరకుండిపోయారు.

'అసలు దీని జాతకమే ఇంత. ఇన్నాళ్లూ ఎలాగూ లేను. వచ్చాకయినా మొహం చూడకపోయినా కలిసి ఉందామనుకుంటే ఆ ప్రాప్తమూ లేక చచ్చూరుకుంది' అని ఆమె చనిపోవడానికి కూడా ఆమెనే కారణం చేసి విరక్తితో మళ్లీ సన్యాసుల్లో కలిసిపోయాడాయన. ఆ తర్వాత మేనమామల పంచన చేరి, మేనత్తల కింద పాట్లుపడి పెళ్లిళ్లయి బయటపడేసరికి జీవితం అర్థం తెలిసి అమ్మను నాన్న కోసం అనవసరంగా చంపుకున్నామనే వేదన కలిగేది పిల్లల్లో. 'ఏనుగంత తండ్రి కంటే ఏకుల బుట్టంత తల్లి మేలు' అనేది ఎంత వాస్తవమో అనుభవపూర్వకంగా తెలిపింది జీవితం.

కామాక్షి కూతుళ్లిద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. తనకు బాగులేదనగానే కాపురాలు వదిలేసి వచ్చి, కాస్తా కూస్తా సేవ చేసుకుని బ్రతికించుకునే తన కూతుళ్లు తిడుతున్నా సంతోషంగానే అనిపించింది. తన తల్లికి తాము చేసిన ద్రోహం గుర్తొచ్చి, అమ్మ కోసం ఆఖరి క్షణంలోనూ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తుడుచుకుందామని చెయ్యెత్తబోతే వీలు కాలేదు.

'అమ్మ కదుల్తోందే అక్కయ్యా'

ఇద్దరూ గబగబా దగ్గరకొచ్చారు. కామాక్షి కళ్లల్లో నీళ్లు చూసి...

'మనం మాట్లాడుకున్నవి విందేమోనే. అందుకే బాధపడుతోంది' అంది చెల్లెలు.

'కాదు కాదు. తిడుతూనో, విసుక్కుంటూనో కన్నందుకు అమ్మ అంటూ వచ్చి బ్రతికించుకుంటున్న మీపాటి ఆత్మీయత మేము మా అమ్మకు చూపించలేకపోయామని బాధేసింది' అని చెప్పాలనుకుంది. మా అమ్మ గుర్తొస్తే గుండె పట్టేస్తుందనీ చెప్పాలనుంది. కానీ చెప్పలేక తల అడ్డంగా ఊపుతూ ఆపేసింది ఊపేందుకు ఇక అవసరం లేక.

'అమ్మ చచ్చిపోయిందే బట్టీ' అంది అక్కయ్య.

●